క్లుప్తంగా

4950 మందికి ఉపాధి పనులు


అంబఖండిలో ఉపాధి పనుల్లో వేతనదారులు

రేగిడి : మండలంలో ప్రస్తుతం 4950 మంది వేతనదారులు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని ఏపీఓ ఎస్.హరనాధరావు వెల్లడించారు. మండలంలో అంబఖండి, సోమరాజుపేట, పెద్దలింగాలవలస తదితర గ్రామాల్లో ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. వేతనదారులకు పనులు నిర్వహణపై అవగాహన కల్పించారు. అన్ని గ్రామాల్లో పనులు చేపడుతున్నామని, వేతనదారులు పనులు చక్కగా వినియోగించుకుంటున్నారని అన్నారు. పనులు వద్ద టెంట్లు, మంచినీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ఘనంగా టైలర్స్ డే


మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న సిస్టర్ హిల్డా

రాజాం సిటీ: స్థానిక సెంటాన్స్ స్త్రీ శక్తి సెంటర్‌లో ప్రపంచ టైలర్స్ డే బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్ డైరెక్టర్ సిస్టర్ హిల్డా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు టైలరింగ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. నైరెడ్ వంటి సంస్థలలో అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ టైలరింగ్‌లో పురుషులకు దీటుగా మహిళలు తయారుకావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో నైరెడ్‌కు చెందిన మగ్గం వర్క్ టీచర్ ఉమ, 40 మంది వరకు మహిళా టైలర్లు పాల్గొన్నారు.

రామాలయం వద్ద ధ్వజ స్తంభం ప్రతిష్ఠ


రామాలయం వద్ద ప్రతిష్ఠిస్తున్న రాతి ధ్వజ స్తంభం


రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి బుచ్చెంపేట గ్రామంలోని రామాలయం వద్ద రాతి ధ్వజ స్తంభాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. ఆలయ పురోహితులు రంప హనుమంతుశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొని తొలిత కళశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. దీంతో గ్రామమంతా రామనామంతో మారుమోగింది.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ


సింధూరార్చణ చేస్తున్న భక్తులు

సంతకవిటి: మండల పరిధిలోని అక్కరాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు పులఖండం శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం క్షీరాధివాసం, అనంతరం గ్రామంలోని స్త్రీల చేత సింధూరార్చన, అనంతరం కళాన్యాస హోమం, దాన్యాధివాసం, పంచశయ్యాధివాసంలు నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నసంతర్పణ చేపట్టారు.

ఉపాధి వేతనం గిట్టుబాటు కావాలి


ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఏపీఓ సత్యవతి

వంగర: ఉపాధి హామీ పనులు రెండు పూటలు చేపడితే గిట్టుబాటు వేతనం వస్తుందని ఏపీఓ మత్రాపు సత్యవతి అన్నారు. మండల పరిధి కొప్పరవలసలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం పరిశీలించి వేతనదారులతో మాట్లాడారు. ప్రతీ రోజు రెండు పూటలు పనులు చేయాలని, అలా చేస్తే రూ.272 వేతనం వస్తుందన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని, వేసవి దృష్ట్యా తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఈసీ హరినారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ కొప్పర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు


బొబ్బిలి: కోమటిపల్లిలో సైన్స్ లోగో ఆకారంలో విద్యార్థుల వరుసక్రమం


సంతకవిటి: సంతోషి స్కూల్‌లో విద్యార్థుల చేసిన ప్రయోగాలను తిలకిస్తున్న ఎంఈఓలు

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి, పెంట, నారశింహునిపేట తదితర గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జాతీయ సైన్సు దినోత్సవ కార్యక్రమాలు బుధవారం ఘనంగా జరిగాయి. అయా పాఠశాలల్లో రామన్ ఎఫెక్టు రూపొందించిన భారత రత్న సీవీరామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కోమటిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులతో రూపొందించిన సైన్సు లోగో వరుస క్రమం పలువుర్ని ఆకట్టుకుంది.

రాజాంలో..

రాజాం : మండలంలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి హెచ్ఎం ఆనెం మహేష్ పూలదండ వేసి నివాళులర్పించారు. మంచి ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు, క్విజ్ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. ఉపాధ్యాయులు పాలవలస మధుసూధనరావు, ఆర్‌వీజే నాయుడు, పి.బలరామమూర్తి, కె.మధుసూధనరావు, ఉమామహేశ్వరరావు, శ్రీలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.


వంగర: అరసాడ జెడ్పీ హైస్కూల్‌లో సైన్సు ప్రయోగాలు పరిశీలిస్తున్న హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు


రాజాం సిటీ: విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎంఈఓ దుర్గారావు

ఘనంగా సైన్స్‌డే

సంతకవిటి: మండల పరిధిలోని శేషాద్రిపురంలోని సంతోషి పబ్లిక్ స్కూల్‌లో బుధవారం సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్‌ఫేర్‌ను ఏర్పాటు చేశారు. ఎంఈఓలు బి.శాంత కుమారి, సీహెచ్.భాస్కరరావులు సైన్స్‌ఫేర్‌ను సందర్శించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బాడంగిలో..

బాడంగి: స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఘనంగా జాతీయ సైన్స్‌డేను బుధవారం నిర్వహించారు. ముందుగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి హెచ్ఎం .సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు చూపరులను ఆకర్షించాయి. ఆ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెర్లాంలో..

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ సైన్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. జాతీయ సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు ప్రయోగాలు చేశారు. సైన్స్‌కు సంబంధించిన క్విజ్, వక్తృత్వ పోటీలను నిర్వహించి, విద్యార్థులకు బహుమతులను ఉపాధ్యాయులు అందజేశారు.

వంగరలో సైన్స్ డే

వంగర: మండలంలోని వివిధ పాఠశాలల్లో సైన్స్‌డే బుధవారం నిర్వహించారు. అరసాడ, వంగర, కొప్పర, మరువాడ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నోబెల్ బహుమతి గ్రహీత, భౌతిక శాస్త్రవేత్త సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు చేశారు.

సృజనాత్మకతకు ప్రయోగాలు దోహదం

రాజాం సిటీ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ప్రయోగాలు ఎంతో దోహదపడతాయని ఎంఈఓ వై.దుర్గారావు అన్నారు. బుధవారం పట్టణంతో పాటు మండలంలోని పలు పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం సందర్భంగా చేపట్టిన ప్రయోగాలను తిలకించి వాటి ఉపయోగాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామభద్రపురంలో...

రామభద్రపురం: మండలంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సివి. రామన్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంల ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పాఠశాలల్లో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనల్లో విద్యార్థులు సృజనాత్మకతను ప్రతిబింబించారు. బూసాయవలస ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. హెచ్ఎం టి.జేమ్స్, ఉపాధ్యాయులు సైన్స్ మేళాలో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వలంటీర్ల సేవలు భేష్

• ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర


వలంటీర్లను సత్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మెంటాడ: వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ఫలాలు లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. ఎన్నికల వేళ టీడీపీ అధినేత చంద్రబాబు మాయ మాటలతో మళ్లీ జనం మధ్యకు వస్తున్నారని తగిన బుద్ధి చెప్పాలన్నారు. బాబుకు తోడు పవన్‌కల్యాణ్ వలంటీర్లను సంఘ విద్రోహులు అని అవమానపరిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీబాయి, పార్టీ అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, జేసీఎస్ కన్వీనర్ త్రినాథ, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, దుర్గ, పార్టీ నాయకులు రత్నాకర్ నాయుడు, రామచంద్ర నాయుడు, హనుమంతురాజు, రాజప్పాలనాయుడు, 19 సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యం


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న జగనన్న ఆరోగ్య సురక్షతో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం సిద్ధిస్తోందని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అన్నారు. పట్టణంలోని గొల్లపల్లి జంక్షన్‌లో గల సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఫేజ్-2ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నేరుగా లబ్ధిదారునికే అందుతున్నాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను వారి పరిధిలోనే అందజేసే వినూత్న కార్యక్రమం ఇదన్నారు. అందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజామోదం లభిస్తోందన్నారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన వారికి మందులు గల సంచులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఎస్.శారద, కోఆప్షన్ మెంబర్ తెర్లి సత్యారావు, టీపీ ఆర్వో జగన్మోహనరావు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ విగ్రహావిష్కరణ


గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సాయిప్రశాంత్‌కుమార్ తదితరులు

రాజాం సిటీ: మండల పరిధి వీఆర్అగ్రహారం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో గాంధీ విగ్రహాన్ని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్ కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులు మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని అన్నారు. గాంధీజీ ఆశయాలు నెరవేరాలంటే బాలల క్రమ శిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం విద్యార్థుల నడవడికపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, సర్పంచ్ డి.వెంకటరమణ, హెచ్ఎం వి.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యం

• స్టేట్ లెవెల్ లిప్ పరిశీలకుడు డాక్టర్ ఉపేంద్రరెడ్డి


బూసాయవలస కేజీబీవీలో విద్యార్థినుల అభ్యసనా సామర్థ్యాలు తెలుసుకుంటున్న స్టేట్ లెవెల్ లిప్ పరిశీలకులు డాక్టర్ ఎస్.ఉపేంద్ర రెడ్డి

రామభద్రపురం: విద్యార్థుల తరగతికి తగ్గ అభ్యసన సామర్థ్యాల పెంపే ప్రభుత్వ లక్ష్యమని స్టేట్ లెవెల్ లిప్ పరిశీలకుడు డాక్టర్ ఎస్ ఉపేంద్ర రెడ్డి అన్నారు. మండలంలోని బూసాయవలస కేజీబీవీ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. అభ్యసన, అభివృద్ధి కార్యక్రమంలో బాగంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన మార్కులు రికార్డు తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థినులతో పాఠ్యాంశాలను చదివించి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యాబోధన ఎలా చేస్తున్నారు? విద్యార్థులతో మోడల్ రీడింగ్ చేస్తున్నారా.. లేదా? కీ వర్డ్స్‌పై డిస్కస్ చేయిస్తున్నారా.. లేదా.. అని ఉపాధ్యాయినిలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలను విద్యార్థులతో చదివించాలని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదివే విద్యార్థులకు అభ్యసన, అభివృద్ధి కార్యక్రమం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా కరదీపిక చదవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌జీ ఎ.ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దమయంతి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు అవగాహన అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ సర్వేశ్వరరావు

రేగిడి : ఇళ్లలో వినియోగించే వంట గ్యాస్ లీకులపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు సూచించారు. మండలంలో సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ప్రధానంగా ఇళ్లలో వినియోగించే గ్యాస్ బండలు ద్వారా లీకులు వస్తుంటాయని, ఆ సమయంలో అక్కడ ఉంటే విద్యార్థులు గుర్తించి ముందుగా రెగ్యులేటర్ ఆపి వేయాలని, అక్కడ ఎటువంటి విద్యుత్ సరఫరా స్విచ్‌లు ఆన్ చేయరాదని సూచించారు. ఏదైన విపత్తు జరిగిన సమయంలో పాలకొండ అగ్నిమాపక కేంద్రం ఫోన్ నంబరు 08941 260111కు,, 101 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మరడాన రామినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు నడిపిల్లి సత్యనారాయణ, ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీదేవికి కుంకుమ పూజలు

రాజాం : పట్టణంలో చీపురుపల్లిరోడ్డులోని గాయత్రీ కాలనీలో వె వెలసిన గాయత్రీదేవి ఆలయ 31వ వార్షికోత్సవ యాత్రా ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కొండవేటి తేజోమూర్తి, వివేకానందరావు పర్యవేక్షణలో యాత్రా ఉత్సవాలను కమిటీ సభ్యులు ప్రారంభించారు. పెద్ద ఎత్తున భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

వంగర: రైతులు వాడుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏపీఎం తెర్లి మంగమ్మ అన్నారు. మండల పరిధి సంగాంలో బుధవారం పర్యటించారు. రైతులతో మాట్లాడారు. వంగర రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా రైతులు వాడుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. ఆమె వెంట సీసీ త్రినాధ్ ఉన్నారు.

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

రాజాం సిటీ: స్థానిక కోర్టు సముదాయంలో మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ మార్చి 16వ తేదీకి వాయిదా పడిందని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీకి సిద్ధమైన కక్షిదారులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు. మరింత మంది కక్షిదారులు రాజీ పడే విధంగా పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

3న పల్స్ పోలియో

రేగిడి : మార్చి 3న చేపట్టనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది విజయవంతం చేయాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అసిరినాయుడు సిబ్బందికి సూచించారు. బుధవారం పీహెచ్‌సీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో చిన్నారులను గుర్తించి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాల్సి ఉందని వివరించారు. ప్రతీ ఒక్కరు సమన్వయంతో పనిచేస్తే కార్యక్రమం విజయవంతం అవుతుందని, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదలకు పట్టాభిషేకం


గ్రామాలు వారీగా ఇంటి పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఇన్‌చార్జ్ డాక్టర్ రాజేష్

• జగనన్న ఇంటి స్థలాల పట్టాదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత
• ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ రాజాం ఇన్‌చార్జ్ రాజేష్

రాజాం : ప్రతీ పేదవాడు సొంత ఇంట్లో ఉండాలనే ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన జగనన్న ఇంటి పథకం లక్షలాది మంది పేదలకు సొంత గూటిని అందించి పెట్టిందని శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలో ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జగనన్న ఇంటి పట్టదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తమ ఆస్తులు, ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వచ్చేందని వెల్లడించారు. ఇప్పుడు అలా కాకుండా గ్రామ, వార్డు సచివాలయాలు వద్దే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉచితంగా జరుగుతుందని తెలిపారు. రాజాం నియోజకవర్గంలో 1894 మంది లబ్ధిదారులకు జగనన్న ఇంటి పథకం ద్వారా పట్టాలు ఇస్తే వాటికి ఇప్పుడు ఉచితంగా రిజిస్ట్రేషన్‌లు చేయించి ఆ రిజిస్ట్రేషన్ పత్రాలు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలు ఏవీ కూడా చేయలేదని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారని వివరించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ కాపీలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, యాలాల వెంకటేష్, నక్క వర్షిణిలు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, తహసీల్దార్ ఎస్‌కే రాజు, రాజాం, సంతకవిటి డిప్యూటీ తహసీల్దార్‌లు చిరంజీవి, రంజిత్, వీఆర్‌ఓలు, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆస్పత్రిలో సేవలు భేష్


ఆస్పత్రిలో సేవలపై ఆరా తీస్తున్న కాయకల్ప ప్రతినిధి

రాజాం సిటీ: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో సేవలు బాగున్నాయని జాతీయ హెల్త్ మిషన్‌కు చెందిన కాయకల్ప ప్రతినిధి శాంతి సౌందర్య అన్నారు. బుధవారం ఆమె తన బృందంతో కలసి ఆస్పత్రిని సందర్శించి అన్ని వార్డులు కలియతిరిగారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై సూపరింటెండెంట్ డాక్టర్ కరణం హరిబాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఆస్పత్రి పరిశీలించినప్పటి పరిస్థితులు కంటే ఇప్పుడు బాగా మెరుగుపడ్డాయని అన్నారు. ఆస్పత్రిలో ఇతర సౌకర్యాలు సమకూర్చుకునేందుకు అవసరమైన వసతి ఉందన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓ పక్క నాడు
• నేడు పనులు జరుగుతున్నప్పటికీ ఓపీ విభాగానికి, రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరిశుభ్రతపై దృష్టి సారించామని సూపరింటెండెంట్ ఆమెకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కల్యాణ్‌బాబు, ముంజేటి కోటేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా సాల్మన్‌రాజ్


సాల్మన్‌రాజ్

వంగర: స్థానిక ఎంపీడీఓగా సాల్మన్‌రాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ ఎం.వి.బాలసుబ్రహ్మణ్యం వీరఘట్టం ఎంపీడీఓగా బదిలీపై వెళ్లగా అక్కడ పని చేసిన ఎంపీడీఓ వంగరకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధితో పాటు ప్రజల నుంచి వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరిస్తానని వెల్లడించారు.

పేదలకు పట్టాల పంపిణీ

• ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మెంటాడ: పేదలకు పట్టాలు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసి నాయుడు, తహసీల్దార్, పార్టీ అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, జేసీఎస్ కన్వీనర్ త్రినాథ, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, దుర్గ, పార్టీ నాయకులు రత్నాకర్ నాయుడు, బాయి అప్పారావు, రామచంద్ర నాయుడు, హనుమంతు రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


పట్టాలు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర